క్లుప్తంగా

భూరక్ష-భూసర్వే రైతులకు వరం



హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రముని

ఓజిలి: జగనన్న భూరక్ష-భూసర్వే కార్యక్రమం రైతులకు వరమని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని అన్నారు. రీసర్వేలో భాగంగా మండలంలోని బత్తలావురం గ్రామంలో రైతుల పొలాల వద్ద జరుగుతున్న హద్దురాళ్ల ఏర్పాటు కార్యక్రమాన్ని సోమవారం ఆర్డీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేను మరింతగా వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సర్వేయర్ గోపిరెడ్డి, వీఎస్ నాగూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం చింతవరం పీహెచ్‌సీ వైద్యులు విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. వైద్యులు పాల్ జాన్సన్, శ్రీపావని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యంలో కొత్త మార్పులు తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో వైద్యసేవలు అందించేలా చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు వైద్యపరీక్షలతో పాటుగా రక్త నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపి, పరీక్షలు చేయించి, రక్తహీనత ఉన్న వారికి మందులు అందించేలా చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జే సుగణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పీ మాధవి పాల్గొన్నారు.

అందరూ సమానమే



మాట్లాడుతున్న తహసీల్దార్ రామయ్య

పెళ్లకూరు: సమాజంలో కుల, మత, వర్గ తారతమ్యం లేకుండా అందరూ సమానమని తహసీల్దార్ రామయ్య సూచించారు. సోమవారం పెళ్లకూరులో పౌరహక్కుల దినం నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ప్రవర్తించడం, అందరితో స్నేహంగా మెలగడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆలయ ప్రవేశాలు అందరికి సమానమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏఓ ప్రవీణ, ఏఈలు ప్రకాష్, మహేష్, వీఆర్వో తేజా, ఏఎస్ఐ సుబ్రమణ్యం, వీఆర్ఏ సుజిత్ పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

దక్కిలి: సమాజంలో ప్రతి పౌరుడు పౌరహక్కులపై సరైన అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. మండలంలోని దగ్గవోలు ఎస్టీ కాలనీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ-2 జగదీష్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, వీఆర్వో గురుమూర్తి, జూనియర్ అసిస్టెంట్ శరణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కీర్తి, మహిళా పోలీసు శ్రీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టండి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని మర్లపూడి, సైదాపురం ఉన్నత పాఠశాలలను ఎంఈఓ దయాకర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరగాలనే ఉదేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

సైదాపురం: మండలంలోని రాగనరామాపురం మేత పోరంబోకు భూముల్లో అక్రమ తవ్వకాలను సాగిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ ఉషా నరసమ్మ సోమవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రాత్రి పూట గ్రామానికి చెందిన పలువురు ఇష్టానుసారంగా తవ్వకాలను సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లీబిడ్డకు ఆయురారోగ్యమస్తు

మంచి ఆరోగ్యానికి మించిన ఐశ్వర్యం లేదు. అందుకే ప్రభుత్వం మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖలో మార్పులకు నాంది పలికింది. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ఎంసీపీ కార్డులు మంజూరు చేసింది. గతంలో ఉండే వివరాలతో పాటు అదనపు సమాచారం ఇందులో పొందుపరిచి అమ్మకు ఆరోగ్యం.. బిడ్డకు భరోసా ఇస్తోంది.

- ఎంసీపీ కార్డుతో పలు ప్రయోజనాలు
- తల్లీ బిడ్డల ఆరోగ్యం వివరాల నమోదు



సైదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సైదాపురం: మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారు. ఇందుకోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నా.. మాతాశిశుమరణాలు ఆగడం లేదు. ఇందుకు అనేక కారణాలున్నాయి. పోషకారహార లోపం, ఒకే చోట వైద్యపరీక్షలు చేయించుకోకపోవడంతో ప్రసవం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో గర్భిణుల ఆరోగ్యానికి సంబంధించి, తొలి నుంచి పూర్తి సమాచారం ఒకేచోట అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం మాతాశిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డులు అందజేస్తోంది. గతంలో ఉండే వివరాలతో పాటు అదనపు సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ ఐదేళ్ల వయసు వరకు ఈకార్డు ఎంతగానో ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు. తల్లికీ బిడ్డకు ఈ కార్డులో ప్రత్యేక ఐడీ నంబర్లు ఇస్తున్నారు.

కార్డులో ఇంకేం ఉన్నాయంటే..

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యసేవలు పొందడంతోపాటు వైద్యపరీక్షలు, రక్తపోటు, మూత్రపరీక్షలు చేయించుకోవాల్సిన సమయాలను ఈ కార్డులో పొందుపరిచారు. కార్డులో ఇచ్చిన సమాచారం ఆధారంగా వైద్యసేవలను పొందడం ద్వారా గర్భిణి ప్రసవించే నాటికి పూర్తి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సంరక్షణ యోజన, ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవానికి ఆర్థిక సాయం తదితర పథకాల వివరాలను ఇందులో పొందుపరిచారు. తొలికాన్పులో సాధారణంగా తలెత్తే సమస్యలు వివరాలు,

వెంకటగిరి నియోజకవర్గ వివరాలిలా..


మండలం	గర్భిణులు	బాలింతలు
సైదాపురం	403	370
రాపూరు	401	372
డక్కిలి	348	330
వెంకటగిరి	525	674
బాలాయపల్లి	251	269
కలువాయి	273	353
మొత్తం	2201	2367

బిడ్డకు ముర్రుపాలు, తల్లి పాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించే అంశాలను దీనిలో ముద్రించారు. గర్భిణులు, బాలింతలు తీసకోవాల్సిన పౌష్టికాహారం వివరాలు ,పిల్లల శారీరక, మానసిక ఎదుగులదలకు సంబంధించిన అంశాలు, ఐరన్, ఫోలిక్ ఆమ్లం ప్రాధాన్యాన్ని కార్డులో పొందుపరిచారు. బిడ్డ పుట్టిన సమయం కార్డులో



గర్భిణీని పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రావణి

నమోదు చేస్తే వెంటనే జనన ధ్రువీకరణ పత్రం వైద్యశాలల్లో అందిస్తారు. వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు, డక్కిలి, బాలాయపల్లి, కలువాయి, వెంకటగిరి మండలాల్లో గర్భిణులు 2,201 , బాలింతలు 2,367 మంది ఉన్నారు.



ఎంసీపీ కార్డు

కార్డు ఆధారంగా ఎక్కడైనా వైద్యసేవలు



“ గర్భిణులు తొలిసారిగా దగ్గరలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో పరీక్ష చేయించుకున్న సమయంలో ఎంసీపీ కార్డులో వివరాలు నమోదు చేసి అందజేస్తారు. ప్రతి నెలా 9వ తేదీ క్రమం తప్పకుండా ఆరునెలలు పాటు పరీక్షలు చేయించుకుంటే ఆమె ఆరోగ్య వివరాలన్నీ కార్డులో నమోదవుతాయి. గర్భిణి రక్త హీనతతో ఉందా? హైరిస్క్ సమస్య ఏదైనా ఉన్నాయో? అనే వివరాలు కార్డులో నమోదు చేస్తారు. ఆ కార్డు దగ్గర పెట్టుకుంటే.. దాని ఆధారంగా ఎక్కడైనా సులువుగా కాన్పు చేయించుకునే అవకాశం ఉంటుంది. - జనార్దన్‌రావు, మండల వైద్యాధికారి,సైదాపురం

కష్టకాలంలో ఆదుకున్నారు!



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ పద్మ (ఫైల్)

చిల్లకూరు: కోవిడ్ విజృంభిస్తున్న సమయంలో ఆస్పత్రుల్లో ఉంటే వలంటీర్లు అక్కడికి వచ్చి పింఛన్ అందించి కష్టకాలంలో ఆదుకున్నారు. మహిళలు కూడా తమ వంతు కర్తవ్యంగా భావించి దూర ప్రాంతంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా నెల మొదటి రోజున పింఛన్ ఇచ్చి ఆదుకున్నారు. కడివేడులోని సర్వేపల్లె పద్మ ఈ క్రమంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కోవిడ్ సమయంలో ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి సైతం పింఛన్ అందించి అండగా నిలిచింది.

సోదరిలా సేవలందించింది



కోవిడ్ సమయంలో నేను ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో తన కుటుంబంలోని అన్నలా భావించిన మా వలంటీర్ పద్మ అక్కడకి వచ్చి పింఛన్ అందజేసి, ఆదుకుంది. కరోనా వ్యాప్తి చెందుతుందని తెలిసి కూడా ధైర్యంగా అక్కడకు వచ్చి పింఛన్ ఇవ్వడం ఆమె సేవా దృక్పథానికి నిదర్శనం.

\- సురేష్, కడివేడు, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు

పొరుగు రాష్ట్రాలు అసూయ పడేలా పథకాలు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

తడ: పొరుగున ఉన్న రాష్ట్రాల ప్రజలు అసూయ పడేలా రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కిలివేటి సంజీవయ్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం కారూరు పంచాయతీ, కారూరు గ్రామంలో నిర్వహించారు. తమిళనాడు సరిహద్దుల్లో, తమిళ ప్రభావం ఎక్కువగా ఉన్న ఈ పంచాయతీలో ఎమ్మెల్యేకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లిన సంజీవయ్య ఆందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రభుత్వ పథకాలు అందుకున్న తీరును తెలుసుకుంటూ, ఇప్పటివరకు అందిన సంక్షేమ ఫలాల బుక్‌లెట్లను అందజేశారు. కిలివేటి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో అత్యధిక కుటుంబాలకు మేలు చేకూరిందని, దీంతో తమకు అడుగడుగునా ఆప్యాయతతో నిండిన ఆహ్వానం అందుతోందన్నారు. కార్యక్రమంలో కారూరు సర్పంచ్ నిత్య, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్‌కే సుందర్‌రెడ్డి, ఎంపీపీ కే రఘురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి, నాయకులు ఆర్ముగం, కోదండం, మునిరత్నంరెడ్డి, మురుగన్, జీ రత్నం, తిరుమలైరెడ్డి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన



ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో బీఎల్వోలు చేస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసరావు సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని 37 మంది బీఎల్వోలు వారి పోలింగ్‌స్టేషన్ల పరిధిలో కమిషనర్ సారథ్యంలో ఈనెల 21 నుంచి ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ చేస్తున్నారు. ఈ క్రమంలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు నమోదు చేస్తున్నారా? మారిన చిరునామాలు, కుటుంబ సభ్యులందరూ ఒకేచోట ఉండేలా చర్యలు చేపడుతున్నారా? అనే విషయాలను కమిషనర్ సర్వే చేస్తున్న ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా పరిశీలించారు.

సీఎం జగన్‌తో నేదురుమల్లి భేటీ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో నేదురుమల్లి

వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు గాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, ధన్యవాదాలు తెలిపారు.

అర్జీలకు అధిక ప్రాధాన్యం

సైదాపురం: స్పందన కార్యక్రమాల్లో వచ్చే సమస్యలను పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తహసీల్దార్ ఎస్ శ్రీనివాసులు అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో మండలస్థాయి అధికారుల సమక్షంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడే సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఏఈ భాస్కర్, ఏఓ శివకుమార్, ఏఓ హైమావతి, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

చింతవరం వాసుల నిరసన

చిల్లకూరు: మండలంలోని చింతవరంలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనం పూర్తి నాసిరకంగా నిర్మించారని గ్రామస్తులు ఆస్పత్రి భవనం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చింతవరంలో పీహెచ్‌సీ భవనం నూతనంగా నిర్మించేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. భవనం నిర్మిస్తున్న కాంట్రాక్టు నాసిరకంగా నిర్మాణాలు పూర్తి చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రవి, గోపాల్, సాయి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

దారి చూపండి

రాపూరు: స్థానిక దళితవాడ వాసులకు శ్మశానానికి వెళ్లే దారి చూపించాలని స్థానికులు సోమవారం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షా కాలంలో దారిలేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు వెంటనే స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు రమణయ్య, శివయ్య, వరబాబు తదితరులు కోరారు.

నగదు ప్రోత్సాహకం పంపిణీ



పద్మశాలి విద్యార్థులకు జ్ఞాపిక, ప్రోత్సాహకం అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

వెంకటగిరి: పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో 2022-23 విద్యాసవంత్సరంలో పది, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ భాను ప్రియ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, ప్రముఖ వైద్యులు సంజీవరాయుడు, పద్మశాలీయుల సంఘం అధ్యక్షుడు పీ చెంచయ్య, సభ్యులు ఏ సత్యనారాయణ, బీ జయశేఖర్, కే శివ కుమార్, రమేష్, చిన్నసుబ్బారావు, శ్రీరామ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.3 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానిస్తూ అమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలో రూపొందించిన 32 అంశాలను చదివి వినిపించారు. మున్సిపాలిటీలో జరిగిన గడప గడ పకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు సచివాలయాలపరిధిలో ప్రజలు అందించిన అర్జీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ సుమారు రూ.కోటి నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజి కాలువలు, తదితర పనుల చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే సుమారు రూ.64 లక్షలు వీధి దీపాలు ఏర్పాటుకు చెల్లింపులు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంకా మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.1.40 కోట్ల సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కమిషనర్ ఐ శ్రీనివాసరావు వివరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, ఆర్‌ఐ షాజహాన్, వైస్ చైర్మన్ జె వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు డీ రవి, సీ చంద్రారెడ్డి, కే రామకృష్ణంరాజు, కే ఆశోక్‌కుమార్, పీ చిన్న పెంచలయ్య, కే వరలక్ష్మి, ఆర్ సరిత, ఎప్ శాంతి, ఎం నీరజ, కే సుమ తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

గూడూరురూరల్: ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేయాలని గూడూరు ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలు, పీడీలు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు సనత్‌కుమార్, కాంచన, పీడీ శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్రాపై సమీక్ష

దక్కిలి: మండల పరిషత్ కార్యాలయంలో త్వరలో జరగనున్న ఆడుదాం..ఆంధ్ర పోటీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి మాట్లాడుతూ ఆడుదాం..ఆంధ్ర పోటీలకు మండలంలోని 17ఏళ్ల పైబడిని యువతీయువకులకు పలు క్రీడా పోటీల్లో అవకాశం ఉంటుందని చెప్పారు. ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్, హెచ్‌ఎంలు భాస్కర్, శ్రీనివాసులు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జయప్రదం చేద్దాం

చిల్లకూరు: ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నిర్మలాదేవి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గురుకుల పీడీ శ్రీరేష్, విశ్రాంత పీడీ జానకిరామ్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెళ్లకూరు: ఆడుదాం..ఆంధ్రను సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ పీ శేఖర్‌రెడ్డి, ఎంఈఓ శంకరయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహిళా క్రికెట్ పోటీలు

వెంకటగిరి: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్‌జోన్ సీనియర్ మహిళ క్రికెట్ పోటీలు సోమవారం కూడా కొనసాగాయి. గ్రౌండ్-1లో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 283 పరుగుల చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 46 ఓవర్లలో 202 పరుగులు చేసి ఆలౌట్ అయింది. చిత్తూరు జట్టు 81 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

గ్రౌండ్2లో...

నెల్లూరు- కడప జట్ల మధ్య మ్యాచ్‌లో కడప జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 312 పరుగులు చేసింది. బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 50 ఓవ ర్లలో 5 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. కడప జట్టు 75 పరుగుల తేడా విజయం సాధించింది.

రూరల్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య

గూడూరురూరల్: ఎంపీపీ అయిన తననే అవమానకరంగా మాట్లాడడమే కాకుండా దళితులపై వివక్ష చూపుతున్న గూడూరు రూరల్ ఎస్ఐ. బ్రహ్మానాయుడుపై జిల్లా ఎస్పీ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గురవయ్య డిమాండ్ చేశారు. గూడూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన స్వగ్రామైన మంగళపూరులోని దళితవాడలో ఆస్తికి సంబంధించి అన్నదమ్ముల మధ్య గొడవ విషయంలో ఎస్ఐ అత్యుత్సాహం ప్రదర్శించారని అడిగానన్నారు. దీంతో తనను అవమానకరంగా మాట్లాడన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ-2 ఎం ఇంద్రాణి, గూడూరు 24 సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కే గోవర్ధన్, నాయకులు ఆశోక్, రమణారెడ్డి, ఫణీంద్రరెడ్డి, దయాకర్, సతీష్, అబ్దుల్లా, సురేష్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, సర్పంచ్‌లు పెంచలయ్య, మస్తానయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడండి



దొంతు శారదకు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

వెంకటగిరి: గ్రంథాలయాభివృద్ధికి దాతలు తోడ్పాటు అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద అన్నారు. పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న గ్రంథాలయానికి ఆర్వీఎం ఉన్నత పాఠశాల 1983-84 పూర్వ విద్యార్థులు బొడగల బాలాజీ, అమర్తలూరు చిట్టిబాబు కలసి వివేకానంద సాహిత్యం కలిగిన 200 పుస్తకాలు నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారదకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠకుల సుంక రవి, నర్రా రవి, ఎస్ పోలయ్య, పూర్వ విద్యార్థులు శ్రీధర్, కరుణాకర్, వీ బాబు, పీ సురేష్, నాగరాజు, లైబ్రేరియన్ అంజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

పెళ్లకూరు: పుల్లూరు రెవెన్యూ పరిధిలోని 150 ఎకరాలు ప్రభుత్వ భూములను కలవకూరు గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు ఆక్రమించుకున్నట్లు ముమ్మారెడ్డిగుంట దళితులు ఫిర్యాదు చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో తహసీల్దార్ రామయ్యకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంబాబు, మాజీ సర్పంచ్ తిరుపాలు, వైఎస్సార్ సీపీ నాయకులు చెంగయ్య, వెంకటయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నందిమాల సర్వే నంబర్ 550-4లో 3.36 ఎకరాలు సుద్దగుంట భూమిని సమీప రైతులు ఆక్రమించుకున్నట్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాఘవయ్య స్పందనలో ఫిర్యాదు చేశాడు.

భూఆక్రమణలపై విచారణ జరపండి

కోట: భూ ఆక్రమణలపై విచారణ జరపాలని గోవిందపల్లె వాసులు సోమవారం తహశీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి న్యాయం చేస్తానని తహసీల్దార్ తెలిపారు. అలాగే పేదలకు కేటాయించిన జగనన్న లేఅవుట్ స్థలాలను కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోటకు చెందిన లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ పద్మావతిని కలసి వినతిపత్రం అందజేశారు.

మేతపోరంబోకు ఆక్రమణపై ఫిర్యాదు

ఓజిలి: నిషేదిత జాబితాలో ఉన్న మేతపోరంబోకు భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని గుర్రంకొండ గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. స్పందించిన తహసీల్దార్ భూములను పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్‌రాజు, ఎం మోహన్‌రాజు, కోటేశ్వర్‌రాజు తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. అలాగే కొండవల్లిపాడు పంచాయతీలో భూ ఆక్రమణలపై సర్పంచ్ ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

సొసైటీల బలోపేతానికే పథకాలు



మోపెడ్‌లను అందజేస్తున్న మత్స్యశాఖాధికారులు

చిల్లకూరు: ఎస్సీ, ఎస్టీ మత్స్యకార సొసైటీలను బలోపేతం చేసేందుకు అందులోని సభ్యులకు మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం పథకాలు అందజేస్తుందని గూడూరు డివిజన్ మత్స్యశాఖాధికారి రాజేష్ తెలిపారు. చిల్లకూరులో సోమవారం తిరుపతి జిల్లాలోని తిరుపతి, ఓజిలి, చిల్లకూరు, నాయుడుపేట, తడ మండలాకు చెందిన 22 మంది మత్స్యకారులకు మోపెడ్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు మత్స్యకారులకు అండగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర దుకాణాలను ఏర్పాటుతోపాటు మినీ వాహనాలు, ఐస్ బాక్సులు ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద 60శాతం సబ్సిడీతో మోపెడ్‌లను అందించి, వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మన్నెం శీనయ్య, పార్టీ మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరందామరెడ్డి, చిల్లకూరు, కోట ఎఫ్‌డీఓలు రఘుబాబు, రెడ్యానాయక్, టీసీఎస్ ఎండీ హర్ష, ఇనుగుంట ఎంపీటీసీ సంధ్యారాణి, ప్రభాకర్, పుష్పరాజ్, వెంకటరమణ, వరప్రసాద్, సుదాకర్, తదితరులు పాల్గొన్నారు.